క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: మరమ్మతుల నేపథ్యంలో విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్, మోచి గల్లీ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, కబూతర్ కమాన్, బంగల్‌పేట్, నాయుడువాడ, బోయవాడ, రామ్‌రావ్‌బాగ్, సాయిబాబా ఆలయం, విశ్వనాథ్‌పేట్, వైఎస్సార్ కాలనీ, గాజులపేట్, డాక్టర్స్ కాలనీల్లో ఉదయం 8:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పొట్టపెల్లి(కే), లక్ష్మణచాంద, తిర్పెల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డుమ్మా టీచర్‌కు నోటీసు

సాక్షి సంస్పందన



జారీ చేసిన నోటీసు

కడెం: మండల కేంద్రంలో ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండు రోజులుగా టీచర్ రావడం లేదని ఈనెల 20న సాక్షిలో టీచర్ డుమ్మా శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంఈవో మధుసూదన్ స్పందించారు. రెండు రోజులు పాఠశాలకు రాకపోవడంపై వివరణ ఇవ్వాలని ఉపాధ్యాయురాలు మధురవాణికి నోటీసు పంపారు. వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం



అమృత (ఫైల్)

కడెం: మండలంలోని పాతకొండుకూర్ గ్రామానికి చెందిన దండేపెల్లి అమృత అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. గత నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. శుక్రవారం అమృత కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 87126 59525 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బెల్లం పానకం ధ్వంసం

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో ఉన్న గుడుంబా స్థావరాలపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారీ, అమ్మకం నేరమని.. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి హెచ్చరించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది భీంరావు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో మర్యాద దినోత్సవం



పూలు ఇస్తున్న మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాద దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, బస్సులో ప్రయాణిస్తున్న వారికి పూలను అందజేశారు. డీఎం మాట్లాడుతూ ప్రతి నెల మూడో శుక్రవారం ఆర్టీసీ మర్యాద దినోత్సవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

'రుణమాఫీపై అపోహలు వద్దు'

ఖానాపూర్: రుణమాఫీపై అపోహలు వద్దని.. రైతులకు పంట రుణాలను మాఫీ చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేని ఆ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బి. గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీపై తప్పుదోవ పట్టించేలా ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని రైతులను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లోనే 22లక్షల మంది రైతులకు రుణాలు మాఫీ చేసిందన్నారు. మిగతా రుణాలను త్వరలో మాఫీ చేస్తుందని పేర్కొన్నారు.

ఖానాపూర్ ఎస్సైగా రాహుల్



ఖానాపూర్: ఖానాపూర్ నూతన ఎస్సైగా గైక్వాడ్ రాహుల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన లింబాద్రి బదిలీపై నిర్మల్‌రూరల్‌కు వెళ్లారు. నూతన ఎస్సై మాట్లాడుతూ దుర్గానవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని ఎస్సై పేర్కొన్నారు.

రైతులను భాగస్వాముల్ని చేయాలి

- డీఆర్డీవో విజయలక్ష్మి
- ఉపాధి పనుల రికార్డులు సరిగా లేవని సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం
- రేవోజీపేట నర్సరీలో అవినీతి జరిగినట్లు నిర్ధారణ
- సమావేశానికి గైర్హాజరైన అటవీశాఖ



దస్తురాబాద్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

దస్తురాబాద్: ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనుల్లో రైతులను భాగస్వాముల్ని చేయాలని డీ ఆర్డీవో విజయలక్ష్మి.. ఈజీఎస్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. 2022–23లో మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఉపాధి పనులపై శుక్రవారం దస్తురాబాద్ రైతువేదికలో సామాజిక తనిఖీ మూడో ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో 250 రకాల పనులున్నాయని.. కేవలం కూలీలకు మాత్రమే పనులు కల్పించడంపై అసహనంవ్యక్తం చేశారు. పథకం కింద ఉన్న నాటుకోళ్ల పెంపకం, పూలు, పండ్ల తోటలు, చేపల పెంపకం గురించి రైతులకు అవగాహన కల్పించి .. వారితో ఏర్పాటు చేయించాలన్నారు.

ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి రికార్డులు సరిగా లేకపోవడం, కూలీల హాజరు పట్టిక తేడాలుండటంపై ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అటవీశాఖ నర్సరీలో లెక్కకు రాని రూ.రెండు లక్షలు

ఉపాధి హామీ నిధులతో మండలంలోని రేవోజీపేటలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.7.90 లక్షలతో 10 వేల మొక్కలు పెంచేందుకు ఏర్పాటు చేసిన నర్సరీ పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మొక్కల పెంపకం, కూలీల ఖర్చు, నిర్వహణకు చేసిన ఖర్చులో రూ.రెండు లక్షల వరకు తేడా ఉన్నట్లు గుర్తించారు. ఈ నర్సరీ నిర్వహణ బాధ్యతలు చూసే అటవీశాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో డీఆర్డీవో విజయలక్ష్మి ఫీల్డ్ అసిస్టెంట్ నవీన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు రమేశ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, జిల్లా విజిలెన్సు అధికారులు లక్ష్మయ్య, సురేందర్, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఏపీవో రవిప్రసాద్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రారంభమైన 'బాలశక్తి'



సోన్: లెఫ్ట్ పోచంపాడ్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వైష్ణవి



అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో వేణుగోపాల్

సోన్: మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బాలశక్తి కార్యక్రమం ప్రారంభించారు. సోన్ పీహెచ్‌సీ వైద్యాధికారి వైష్ణవి, ప్రిన్సిపాల్ ఆర్.ప్రశాంతితో కలిసి విద్యార్థినులకు బాలశక్తిపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పరిశుభ్రత, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తోపాటు ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పురుషోత్తం, శారద, రాజమణి, ఏఎన్ఎం నిఖిత, స్టాఫ్ నర్స్, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కడెం: కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం బాలశక్తి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు, హెచ్ఈవో వేణుగోపాల్ విద్యార్థులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. పిల్లల ఎత్తు, బరువు పరిశీలించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నిర్మల, రేణుక, లక్ష్మి, నిహారిక, భూమయ్య, రమేశ్, గోదావరి తదితరులున్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా-హీ-సేవా కార్యక్రమం



మామడ: పొన్కల్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మామడ: పరిసరాల పరిశుభ్రంగా ఉంచి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పొనకల్ గ్రామంలో శ్రమదానం నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో గంగసాగర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల, ఈజీఎస్ ఏపీవో శివాజీ, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సురేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని న్యూబొప్పారం గ్రామంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వారంలో రెండు రోజులు డ్రై డే పాటించాలన్నారు. పంచాయతీ సిబ్బంది పిచ్చిమొక్కలు తొలగించి.. కుండీల్లో నిలిచిన నీటిని పారబోయించారు. కార్యదర్శి అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తానూరు: గ్రామంలో మురుగుకాల్వలను, వీధులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా శుక్రవారం మండలంలోని కోలూరుతండాలో పర్యటించారు. ప్రజలకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వారి వెంట ఎంపీడీవో అబ్దుల్ సమద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కుంటాలలో..

కుంటాల: స్వచ్ఛతా హీసేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీవో ఎంఏ రహీం ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది ప్రసాద్, రాణి, మమత, దేవకి, లక్ష్మి, ప్రశాంత్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బామిని(బి)లో భోజనం చేస్తున్న చిన్నారులు



ముధోల్ : తరోడాలో ..

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ పంచాయతీలోని దర్యాపూర్, బామిని(బి) గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషకపాత్ర -మన వంట అంగన్‌వాడీ ఇంట కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణకు ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమం చేపడుతామని ఏపీఎం సునంద తెలిపారు. అనంతరం చిన్నారులకు పలు ఆహార పదార్థాలు తినిపించారు. కార్యక్రమంలో డీపీఎం జ్ఞాను, సీసీ ముత్యం, టీచర్లు వీవో, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని తరోడా, ముద్గల్ గ్రామాల్లో శుక్రవారం పోషకపాత్ర-మన వంట అంగన్‌వాడీ ఇంట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఉన్నారు.

ఖానాపూర్: పోషకాహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ ఆర్.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. కౌసల్య, గేయలత తదితరులు ఉన్నారు.

నిల్వనీటిని పారబోయండి

- డీఎల్‌పీవో రమేశ్
- గ్రామాల్లో ఫ్రై డే. డ్రై డే



భైంసాలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్(జి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిల్వనీటిని పారబోయాలని డీఎల్‌పీవో రమేశ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం డ్రైడే లో భాగంగా నర్సాపూర్ (జి), నందన్ గ్రామాల్లో పర్యటించారు. కూలర్లు, డ్రమ్ములు, కుండీలు, పాతటైర్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం నందన్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వీణారెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలో మున్సిపల్, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే నిర్వహించారు. కుంట ఏరియాలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వర్షపు నీరు నిల్వకుండా, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, హెచ్ఈఓ కలీమొద్దీన్, ఆశ, ఏఎన్ఎంలు ఉన్నారు.

ముధోల్: మండలంలోని ముద్గల్, తరోడా గ్రామాల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు, భాస్కర్ గౌడ్ నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో కారోబారి గణపతి, ఆలంఖాన్, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేశ్వరం: గ్రామాల్లో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజూర, ధర్మోర, పంచగుడి, వట్టోలి తదితర గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంనిర్వహించారు. ముందుగా గ్రామాల్లో మొక్కలు నాటి పాఠశాలల్లో విద్యార్థులకు ఫ్రై డ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటింటా తిరిగి సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోలమాన్‌రాజ్, ఆయ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోవాలి

భైంసాటౌన్: పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆపిట్కో శిక్షణ కేంద్రంలో విశ్వకర్మ లబ్ధిదారులతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈసందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 80 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్‌బీఐ అధికారి రాంగోపాల్, ఫీల్డ్ ఆఫీసర్ విద్యాసాగర్, శిక్షణ కేంద్రం కోఆర్డినేటర్ అవినాష్ కుమార్, ట్రైనర్ ప్రసంజిత్, గురుచరణ్ యాదవ్, ఆకాశ్, సురేఖ, స్వాతి, మౌనిక పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

తానూరు: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు వై.చిన్నారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని హంగిర్గా, దాగాం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి కొట్టె కృష్ణ, బూత్ అధ్యక్షుడు రాంనాథ్, సుధాకర్, సుదర్శన్, గణేశ్‌పటేల్, బండు పటేల్, మాధవ్ రావ్, గంభీర్ పటేల్, నవీన్‌రెడ్డి, రాము, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

భైంసాటౌన్: మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని.. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి అన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

గణిత విజ్ఞాన మేళా

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లీ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి గణిత విజ్ఞానమేళా నిర్వహించారు. విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి కిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. పాఠశాల విభాగ్ సహకార్యదర్శి దామోదర్, సంకుల ప్రముఖ్ గోపాల్ కిషన్, ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకే ఎమ్మెల్సీగా పోటీ

- గెలిస్తే జీతం కూడా తీసుకోను
- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వి.నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: నిరుద్యోగులకు సేవ చేయడం కోసమే వచ్చే కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీగా గెలిస్తే జీతం కూడా తీసుకోబోనని ప్రకటించారు. శుక్రవారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో నిరుద్యోగులకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నానని.. ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకొని.. వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, న్యాయవాదులతో, ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రైవేటు టీచర్లతో సమావేశం అయ్యారు.

'నేటి రాష్ట్ర బంద్‌కు సహకరించాలి'



నినాదాలు చేస్తున్న ఆదివాసీ నాయకులు

కడెం: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో గిరిజన మహిళపై జరిగిన దాడికి నిరసనగా శనివారం రాష్ట్రవ్యాప్త బంద్ పాటించాలని ఆదివాసీ జేఏసీ ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ ఆత్రం రవీందర్, మహిళా నాయకులు పెందూర్ ప్రియాంక పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బంద్‌కు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. బాధితురాలికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆమె కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని ఉరి తీయాలని పేర్కొన్నారు. ఇందులో ఆదివాసీ నాయకులు చందు, అనూష, విజయ్, భీంబాయి, చిన్నుపటేల్ తదితరులున్నారు.

ఉపాధి పనుల రికార్డులు సిద్ధం చేసుకోవాలి

తానూరు: మండలంలో 2023–24లో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై వచ్చే నెలలో సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా తనిఖీలు చేస్తాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

'సాయుధ పోరాటంతోనే విలీనం'



ముధోల్‌లో మాట్లాడుతున్న కార్యదర్శి విలాస్

ముధోల్: మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడారు. కమ్యూనిస్టుల త్యాగాల ఫలితమే హైదరాబాద్ సంస్థానం.. భారతదేశంలో విలీనమైందన్నారు. కొందరు సెప్టెంబర్ 17ను విమోచనం అంటున్నారని.. ఇది ముమ్మాటికీ విలీనమేనని పేర్కొన్నారు. అనంతరం సాయుధ పోరాటంలో అమరులైన వీరులకు నివాళులర్పించారు. ఉపాలి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అనంతరావు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొండిబా, గౌతమ్, శివాజీ, మసూద్, అహ్మద్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: సాయుధ రైతాంగ పోరాటంతోనే హైదరాబాద్ సంస్థానం.. భారతదేశంలో విలీనమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద పోరాట వార్షికోత్సవం నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. కామ్రేడ్ ఉపాలి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గే అనంత రావు, కర్ణాకర్, హాజీ, సట్వాజీ, విఠల్, సోమేశ్, కార్మికులు పాల్గొన్నారు.

శుద్ధజల యంత్రం అందజేత



యంత్రం ప్రారంభిస్తున్న సత్యనారాయణరెడ్డి

కుంటాల: భైంసా మండలం సుంక్లి గ్రామానికి చెందిన, పెండ్‌పెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అమృతం మండల కేంద్రంలోని బీసీ వసతిగృహానికి రూ.20వేల విలువైన శుద్ధజల యంత్రం అందజేశారు. వసతిగృహానికి శుద్ధజలం అందించడం అభినందనీయమని జిల్లా బీసీ వెల్ఫేర్ సహాయ అధికారి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. అనంతరం అమృతంను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో నాగేష్, ముత్యంరావు, గంగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో గెలిపించాలి'

ఖానాపూర్: త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగులు, ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో మాట్లాడారు. కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. తమ మద్దతు శేఖర్‌రావుకు ప్రకటిస్తున్నట్లు ఖానాపూర్ ట్రస్మా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా మండలాధ్యక్షుడు పుప్పాల మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి విద్యాలత, జిల్లా సలహాదారులు మనోహర్‌స్వామి, మండల ఉపాధ్యక్షుడు సాంకేత్, మదిరె శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, సుభాశ్, మహేందర్, విష్ణు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

'సంక్షేమ బోర్డు ద్వారానే అందించాలి'

కడెం: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ద్వారానే పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రమాద మరణం, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యానికి పరిహారం అందించే ప్రక్రియను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. పాతవిధానంలోనే పథకాలు అందించాలని కోరారు. సంఘం నాయకులు కోటయ్య, గంగాధర్ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఖానాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎంపీవో రత్నాకర్ రావు పరిశీలించారు. మండలంలోని పాతఎల్లాపూర్, గోసంపల్లె, గోడలపంపు, దిలావర్‌పూర్, కొత్తపేట్ గ్రామాల్లో పర్యటించారు. కేంద్రాల్లోని వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వ్యాధులపై అవగాహన

ఖానాపూర్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు స్థానిక ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో హెచ్ఐవీ ఎయిడ్స్, సుఖవ్యాధులు, టీబీపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఎస్టీఎస్ వేణుగోపాలకృష్ణ, కంట్రోలర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముగిసిన నిమజ్జనం

కుంటాల: మండలంలోని కల్లూరు, కుంటాల గ్రామాలలో శుక్రవారం ఘనంగా వినాయక నిమజ్జనం నిర్వహించారు. శోభాయాత్రలో యువకులు నృత్యాలు చేస్తూ స్థానిక చెరువుల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భైంసారూరల్ సీఐ నైలు, ఎస్సైలు భాస్కరాచారి, సుమాంజలి, రవీందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భాషా దినోత్సవం

లోకేశ్వరం: లోకేశ్వరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతం, అధ్యాపకులు వెంకటేశ్, నవీన్, చిన్నయ్య, వినోద్, విఠల్, శ్రీనివాస్, మహేందర్, ప్రమీలరాణి, హరీశ్ విద్యార్థులు ఉన్నారు.